1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

గురువారం | 18 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి




నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన నీరటి వెంకటేష్ (46) మంగళవారం చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. అతనికి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 16వ తేది మధ్యాహ్నం సమయంలో చేపలు పట్టడానికి వెళుతున్నానని, ఇంట్లో చెప్పి వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాకపోయేసరికి అతని కోసం వెతికారు. అతను చెక్ డాంలో మునిగి చనిపోయి ఉండవచ్చని అనుమానంతో చెక్ డాం వైపు వెళ్లి చూడగా ప్రమాదవశాత్తు చేపలు పట్టే వల కాళ్లకు చిక్కుకొని చనిపోయినట్టుగా గుర్తించారు. మృతుడి భార్య నీరటి కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా శ్రీరామ నవమి, కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

హవేలీ ఘనపూర్ మండలంలో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి పురస్కరించుకొని శ్రీ రాములవారి కళ్యాణ మహోత్సవం, పల్లకి సేవ కార్యక్రమాలను చేపట్టారు. బూరుగుపల్లి, హవేలి ఘనపూర్, తొగుట, సర్దన, వాడి, నాగపూర్, తిమ్మాయిపల్లి, బ్యాతోల్ గ్రామాల్లో ఘనంగా శ్రీరాముల వారి కళ్యాణం నిర్వహించారు .అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొగిట గ్రామంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి రాముల వారి కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మంద శ్రీహరి, సవిత శ్రీకాంత్, సునీత సాయిలు, నాయకులు వెంకట్ రెడ్డి, శ్రీపాల్, శ్రీనివాస్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి నామినేషన్

- సీపీఐ(ఎం) పార్టీమండల కార్యదర్శి సత్తిరెడ్డి



నవతెలంగాణ -కొమురవెల్లి

రేపు సీపీఐ(ఎం) పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండి జహంగిర్ భువనగిరిలో నామినేషన్ వేస్తారని ఈ కార్యక్రమానికి కార్యకర్తలు నాయకులు భారీగా తరలిరావాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న శుక్రవారం భువనగిరిలో జహంగీర్ నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని తెలిపారు. ఈ కార్యకమానికి మండల వ్యాప్తంగా నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే ప్రశ్నించే గొంతుక సీపీఐ(ఎం)ని మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, రాంసాగర్, తాజా మాజీ సర్పంచ్, తాడూరి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, నీల బిక్షపతి, తాడూరి మల్లేశం, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని కల్యాణానికి హాజరైన మంత్రి



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం కట్కూరు గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు ముకుందారెడ్డి ఆధ్వర్యంలో రాముని కళ్యాణ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. రాములోరి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి, పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుధేష్ణ, మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, ఉల్లెంగుల రాజు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ కళ్యాణోత్సవం





నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని వరదరాజ్ పూర్ గ్రామంలో గల వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను పి.గోపాలక్రిష్ణ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వరదరాజస్వామి ఆలయం నుంచి సీతారామచంద్రుల స్వామి వారిని వీరాంజనేయ ఆలయం వరకు ఎదుర్కోలు నిర్వహించి సాయంత్రం సీతారాముల కల్యాణం మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణలతో మధ్య అత్యంత వైభవోపేతంగా కనుల పండువుగా సాగింది. అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త పి.మాలతి -గోపాలక్రిష్ణ దంపతుల అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు గుండు శ్రీనివాస్ శర్మ,రాంమోహన్ శర్మ,వేణు గోపాల చారి, పురుషోత్తమ చారి,, వర్షత్ శర్మ, భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు మూడంచెల పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ బాలస్వామి



నవతెలంగాణ-మెదక్

నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు మూడు అంచెలా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ బి. బాలస్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు జరుగుతుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. దానికోసం సెంట్రల్ ఫోర్స్, అర్మ్డ్, సివిల్ ఫోర్స్‌తో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ పరంగా అవసరమైన అన్ని భద్రతా చర్యలు, పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. రిటర్నింగ్ అధికారి చాంబర్ నుంచి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

కనుల పండుగగా రాములోరి కళ్యాణం

- కళ్యాణంలో పాల్గొన్న నీలం మధు



నవతెలంగాణ-మనోహరాబాద్

తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లో సీతారామస్వాముల కళ్యాణ వేడుకలు కనుల పండగగా జరిగాయి. కూచారం గ్రామంలోని కోదండ రామాలయంలో రాములోరి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాములోరి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వమించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు పాల్గొన్నారు. ముందుగా కాళ్లకల్‌లోని బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం సీతారామస్వామి కళ్యాణంలో పాల్గొన్నారు. అలాగే కూచారంలో కోదండరామాలయంలో సీతా రామస్వామి కళ్యాణంలో పాల్గొని ప్రజలతో కలిసి అన్నదానంలో పాల్గొని భోజనం చేశారు. అనంతరం తూప్రాన్‌లోని రామాలయంలో నిర్వహించిన సీతా రామస్వామి కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, జిల్లా యువత అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు చిట్కుల్ మహిపాల్‌రెడ్డి, జక్కిడి నరేందర్‌రెడ్డి, నర్సింలుగౌడ్, వంగాల రమేష్‌గౌడ్, సంతోష్ పంతులు, ఆంజనేయులుగౌడ్, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి, యంజాల సుధాకర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

నామినేషన్లు షురూ



- మెదక్ కలెక్టరేట్‌లో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం
- సంగారెడ్డి కలెక్టరేట్‌లో జహీరాబాద్ నియోజకవర్గం
- 18,19, 24 మంచి ముహూర్తాలంటూ తేదీలు ఖరారు
- 20 న నీలం మధు నామినేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు
- 18 న బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫామ్‌ల అందజేత
- నేడు బీజేపీ అభ్యర్థి రఘునందన్ నామినేషన్
- భారీ రోడ్ షోలకు ప్లాన్...బల ప్రదర్శనకు సిద్ధం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం జారీ కానుంది. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదైన విషయం విధితమే. తెలంగాణ వ్యాప్తంగా 17 ఎంపీ స్థానాలకు జరిగే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెనువెంటనే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆయా పార్టీలు ఎంపీ అభ్యర్థులను ప్రకటించాయి. పార్టీ పరంగా సన్నాహాక సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలకు సిద్ధమయ్యాయి. ఇక నామినేషన్ దాఖలు చేసే ప్రక్రియ పూర్తవ్వగానే ఎన్నికల ప్రచార రంగంలోకి దిగనున్నారు. బీఆర్ఎస్ కాస్త ముందస్తుగానే మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల ఆశీర్వాద సభ జరిపింది. కాంగ్రెస్ పార్టీ సైతం నామినేషన్లు వేసిన వెంటనే ఎన్నికల ప్రచారం కోసం జన జాతర సభల్ని నిర్వహించనుంది. బీజేపీ సైతం ప్రచారాన్ని వేగవంతం చేయనుంది. గుర్తింపు పొందిన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎంపీలుగా పోటీ చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణ కోసం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి మెదక్ కలెక్టరేట్‌లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియంతా రెండు జిల్లా కలెక్టరేట్లలోని ఎన్నికల విభాగం చూడనుంది.

నేటి నుంచి నామినేషన్లు ప్రారంభరం

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు గురువారం నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక అభ్యర్థుల నుంచి 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు. అభ్యర్థి మరో నలుగురుతో కూడి ప్రతినిధి బృందం మాత్రమే ఎన్నికల రిటర్నింగ్ అధికార చాంబర్‌లోకి అనుమతిస్తారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, మెదక్ పార్లమెంట్ నియోకవర్గ రిటర్నింగ్ అధికారిగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వ్యవహరిస్తారు. రెండు జిల్లా కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో నామినేషన్ పత్రాల్ని స్వీకరించేందుకు ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 25న మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుంది. ఆ సమయనికి రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో ఉన్న వాళ్ల నామినేషన్లు మాత్రమే స్వీకరిస్తారు. ఒక్కరు నాలుగు సెట్ల పత్రాల్ని ఇవ్వొచ్చు. పార్లమెంట్ నియోజకవర్గం కాని వాళ్లపోటీ చేస్తే అతను ఓటరుగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్ఓతో ఓటరు గుర్తింపు ధృవీకరణ పత్రం సమర్పించాలి. గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమకు కావల్సిన గుర్తు కోసం ఫారంలోని పార్ట్-3లో సి కాలం ఎదురుగా ఏవైన మూడు గుర్తులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలి. అభ్యర్థులు కొత్త బ్యాంకు ఖాత తీయాలి. దాని ద్వారానే ఎన్నికల వ్యయాన్ని చూపించాలి. క్రిమినల్ కేసులు, ప్రభుత్వ క్యాటర్స్‌లో ఉంటే బిల్లుల చెల్లింపు నో డ్యూస్ సర్టిఫికెట్ వంటి వివరల్ని నింపాలి. వచ్చిన నామినేషన్లను ఈ నెల 26 న పరిశీలిస్తారు. నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న అన్ని కాలమ్స్‌ను నింపడం, సరైన సమాచారాన్ని పొందుపర్చడంలో ఏమైన లోపాలుంటే వాటిని తిరస్కరిస్తారు. ఈ నెల 29 న నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

20న నీలం మధు నామినేషన్, సీఎం రేవంత్‌రెడ్డి హాజరు

మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఈ నెల 20న మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో నామినేషన్ వేయనున్నారు. నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. అదే విధంగాఆ జిల్లా ఇంచార్జీ మంత్రి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జి కొండా సురేఖ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యేలు తూర్పు జగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంతారావు, నియోజకవర్గాల ఇంచార్జీలు కాట శ్రీనివాస్ గౌడ్, ఆవుల రాజిరెడ్డి, తూకుంట నర్సారెడ్డి, పూజర్ల హరికృష్ణ, చెరుకు శ్రీనివాసరెడ్డితో పాటు ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొననున్నారు. వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులతో నీలం మధు నామినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నందున భారీ ఎత్తున జన సమీకరణకు మంత్రి కొండా సురేఖ పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. మండల, పట్టణ కమిటీలు వేసుకుని జన సమీకరణ చేయాలని సూచించారు. నామినేషన్ సందర్భంగా మెదక్ పట్టణంలో భారీ రోడ్ షో నిర్వహిం చనున్నారు.

నేడు రఘునందన్‌రావు నామినేషన్

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. భారీ జన సమీకరణ మధ్య ఆయన మెదక్ కలెక్టరేట్‌లో నామినేషన్ వేస్తారు. ఈ కార్యక్రమానికి గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఏడు అసెంబ్లీ నియోకజవర్గాల నుంచి బీజేపీ కార్యకర్తలు, అభిమానుల్ని తరలిరావాల్సిందిన పిలుపు నిచ్చారు.

కేసీఆర్ చేతుల మీదుగా అభ్యర్థులకు బీఫారాలు

మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పార్టీ నుంచి ప్రకటించిన అభ్యర్థులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురువారం హైదరాబాద్‌లో పార్టీ బీఫామ్స్ అందజేయనున్నారు. మెదక్ నుంచి వెంకట్రాంరెడ్డి, జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్ బీఫామ్స్ అందుకున్న తర్వాత మంచి రోజు చూసి నామినేషన్ వేయనున్నారు. ఈ నెల 16న రెండు నియోజకవర్గాలకు కలిసి సుల్తాన్‌పూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. భారీ ఎత్తున జన సమీకరణ చేశారు. వెంటనే జన సమీకరణ చేయడం కష్టం కావున ఒకటి రెండు రోజుల తర్వాత నామినేషన్ వేయనున్నారు.

పకడ్బందీగా నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ

- ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను పరిష్కరించాలి
- రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి
- రాష్ట ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



నవతెలంగాణ-మెదక్

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఏప్రిల్ 26 నాటికి తుది ఓటరు జాబితా రూపొందించాలన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో ఓటర్ స్లిప్పులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ముందస్తుగానే ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలని, ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్‌పై పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీలు నియమించిన పోలింగ్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేసే సమయంలో పాల్గోనవచ్చని, ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎక్కడా అందలేదనే ఫిర్యాదులు రావద్దన్నారు. ఏప్రిల్ 18న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. నామినేషన్ స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోటీ చేసే తుది అభ్యర్థుల జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నామినేషన్ స్వీకరణ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పోటి చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ దాఖలుకు ముందు ప్రీ వెరిఫికేషన్ డెస్క్ వద్ద పరిశీలించాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి సాధ్యమైనంతవరకు ప్రత్యేక ఎంట్రీ ఎగ్జిట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియోగ్రాఫీ, ఫోటో గ్రఫీ జరగాలని, రిటర్నింగ్ అధికారి చాంబర్ లో సిసి కేమేరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ల స్వీకరణపై ప్రతి రోజు నివేదికలను సమర్పించాలని, ప్రతి రోజూ దాఖలైన నామినేషన్, అభ్యర్థుల అఫిడవిట్‌లు పారదర్శకంగా ఆన్‌లైన్ లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పద్మశ్రీ, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, ఎలక్షన్ సూపరిండెంట్ హర్దీప్ సింగ్, ఇడియం సందీప్, మెదక్ తహసిల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



నవతెలంగాణ-మర్కుక్

ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పాములపర్తి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది.మర్కుక్ పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన లెంకల బాను ప్రాద్ (26) నీళ్ళ కోసం ఇంట్లో ఉన్న సంపు మోటారు వేశాడు .సంపులో ఉన్న మోటార్ రిపేర్ రావటంతో మరమ్మతులు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మర్కుక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వింజపల్లిలో బొడ్రాయి ప్రతిష్టపనకు రావాలని మంత్రికి ఆహ్వానం అందజేత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వింజపల్లి గ్రామంలో నేడు, రేపు జరగనున్న బొడ్రాయి ప్రతిష్టపన కార్యక్రమానికి రవాణాశాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హాజరు కావాలని కోరుతూ కాంగ్రెస్ గ్రామశాఖ నాయకుల ఆధ్వర్యంలో ఆయనకు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. గ్రామంలో అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆహ్వానపత్రికలో పేర్కొన్నట్లు తెలిపారు. దీనికి గాను మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరికోలు ఎంపీటీసీ బోయిని నిర్మల జయరాజ్, మాజీ సర్పంచ్‌లు శెట్టి సుధాకర్, బద్దం తిరుపతిరెడ్డి, నాయకులు గుర్రాల రాజేశ్వర్‌రెడ్డి, కొమ్ముల చిన్న కనకారెడ్డి, గర్రెపల్లి పర్శరాములు, గర్రెపల్లి అనిల్, గర్రెపల్లి సాయి, తదితరులు పాల్గొన్నారు.

వరుసగా మూడు సార్లు పర్వతారోహణం

- యన్‌సీసీ కాడేట్ రాజేష్






నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మూడవ సంవత్సరం చదువుతున్న యన్‌సీసీ కాడేట్ రాజేష్ గత మూడు సంవత్సరాల నుండి వరుసగా బేసిక్ (బీఎంసి), అడ్వాన్స్‌డ్ మౌంటెయినేరింగ్ (ఏయంసీ) సెర్చ్ అండ్ రెస్క్యూ (యస్ అండ్ ఆర్) క్యాంపులను పూర్తి చేశారని కళాశాల ఎన్సిసి ఆఫీసర్ డాక్టర్ భవాని తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులకు ప్రకటనలో తెలిపారు. కరోనా కారణంగా ఆగిపోయిన యన్‌సీసీ శిబిరాలను తిరిగి ఆరంభించగానే వచ్చిన ఈ అరుదైన అవకాశాన్ని తెలంగాణ రాష్ట్రం తరపున కేవలం మనం మాత్రమే వినియోగించుకున్నట్లు కళాశాల యన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ భవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేసిక్ మౌంటైనేరింగ్ క్యాంప్ పూర్తి చేసిన వారు మాత్రమే అడ్వాన్స్ మౌంటైనరింగ్ క్యాంపునకు దాని తర్వాత సెర్చ్ అండ్ రెస్క్యూ మౌంటెయినీరింగ్ క్యాంప్ ను పూర్తి చేయడానికి కృషి చేసినట్లు ఆమె తెలిపారు. అర్హులను శారీరక దారుఢ్యం ఆధారంగా ఎంపిక చేసిన కేడేట్ రాజేష్ బేసిక్ మౌంటైనీరింగ్ శిబిరము హిమాచల్ ప్రదేశ్ లోని మనాలి లో 2022 అక్టోబర్ ఒకటి నుండి అక్టోబర్ 26 వరకు దాదాపు 26 రోజుల పాటు, అడ్వాన్స్ మౌంటేనేరింగ్ క్యాంప్ 2023 నందు పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ లో ఏప్రిల్ ఒకటి నుండి ఏప్రిల్ 28 వరకు దాదాపు 28 రోజుల పాటు, సెర్చ్ అండ్ రెస్క్యూ క్యాంప్ 2024 లో మార్చ్ 22 నుండి ఏప్రిల్ పదకొండు వరకు 20 రోజుల పాటు ఉత్తరాఖండ్ లోని ఉత్తర కాశీలో పూర్తి చేసినట్లు తెలిపారు. అదే విధంగా బీయంసీ క్యాంప్ భాగంగా లో రాక్ క్లైమ్బింగ్ (పర్వతారోహణ), రివర్ క్రాసింగ్, మంచు పర్వతాలు అదిరోహించడం తో పాటు దాదాపు 14000 అడుగుల ఎత్తును ఎక్కినట్లు, బీయంసీ క్యాంప్ లో భాగంగా అడ్వాన్స్డ్ టెక్నిక్స్ తో దాదాపు 17000 అడుగుల పర్వతారోహణను పూర్తి చేసినట్లు రాజేష్ తెలిపారు. దాదాపు మూడు నెలల పాటు క్యాంప్‌లో అవకాశాన్ని కలిగించినందుకు సంగారెడ్డి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ పీ యస్ నందా కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి, కళాశాల బృందం కాడేట్ రాజేష్ ను అభినందించారు.

నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.
- నిబంధనలు కచ్చితంగా పాటించాలి.
- ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలి- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. . గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నేపథ్యంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై అన్ని జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో బుధవారం రోజున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన అంశాలను వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణ వరకు రిటర్నింగ్ ఆఫీసర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో నిబంధనలు పాటించేలా చూడాలని సూచించారు. అభ్యర్థుల వెంట వచ్చేవారు, వాహనాల సంఖ్యను నిబంధన మేరకు అనుమతించాలని పేర్కొన్నారు. నామినేషన్ల నుంచి పోలింగ్ జరిగే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. స్టాటస్టిక్ సర్వే లైన్స్ టీమ్‌లు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సువిధ కింద ప్రచారము, సభలు, సమావేశాలకు సంబంధించి అనుమతులను వెంట వెంటనే ఇవ్వాలని తెలిపారు. సి- విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారానికి సంబంధించి వచ్చే పోస్టులపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణ సమయంలో సింబల్ అలాట్మెంట్ జాగ్రత్తగా జరిగేలా చూడాలని తెలిపారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని,నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని సూచించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, క్రాంతి వల్లూరు ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , జహీరాబాద్ ఆర్ డి ఓ రాజు , ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ అంథోని తదితరులు పాల్గొన్నారు.

కేదారినాథ్ యాత్రికులకు అన్నదానం చేయడం అభినందనీయం

- ఎమ్మెల్యే హరీశ్ రావు
- కేదారినాథ్‌లో అన్నదానం ఏర్పాటు కరపత్రం ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సిద్దిపేట

మానవ సేవయే... మాధవ సేవా అని, అన్నిదానాల కన్నా గొప్పదానం అన్నదానం అని కేదారినాథ్ యాత్రికులకు అన్నదానం చేయడం అభినందనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేదారినాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో కేదారినాథ్ లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో బుధవారం కరపత్రాన్ని హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అంటే సేవా కార్యక్రమాలను అందిపుచ్చుకున్న ప్రాంతం అని, దేశంలో చార్‌ధామ్ యాత్రలో అమర్‌నాథ్, కేదారినాథ్ యాత్రలు ప్రత్యేక మైనవివని, అలాంటి యాత్రకు వెళ్లే భక్తులకు అక్కడ భోజనం పెట్టె అదృష్టం సిద్దిపేట ప్రజలకు, కేదారినాథ్ సేవాసమితికి కలిగిందన్నారు. ఇటీవల అయోధ్యలో అన్నదానం ఏర్పాటు చేశారని, అదేవిదంగా గతంలో అమర్‌నాథ్ వెళ్లే యాత్రికులకు, గత నాలుగు ఏండ్లుగా కేదారినాథ్ వెళ్లే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. అంత దూరంలో ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. వచ్చే నెల 3న సిద్దిపేట నుండి లారీలో అన్నదాన సామాగ్రి బయలుదేరి వెళుతుందని, మే 10న అన్నదానం ప్రారంభం కానున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నవీన్ కుమార్, రత్నాకర్, మధుసూదన్, ఫారూఖ్ హుస్సేన్, గంప శ్రీనివాస్, పాల్గొన్నారు.

శ్రీరాముని దీవెనతో శుభం జరగాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ - సిద్దిపేట

శ్రీరాముని దీవెన తో అంతటా శుభం జరగాలని కోరుకున్నట్టు ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలో వివిధ దేవాలయాలలో జరిగిన సీతారాముల కళ్యాణం వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేట పట్టణం లో 4 గంటల పాటు 25 ఆలయాల్లో జరిగిన శ్రీ సీతా రామచంద్ర స్వామి కళ్యానోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఒక వైపు శ్రీరామ నామ స్మరణ, మరో వైపు ప్రజలతో ఆత్మీయ పలకరింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు రాజనర్సు, అరవింద్ రెడ్డి, సంపత్ రెడ్డి, పాల్గొన్నారు.

అయ్యప్ప అపద్బాంధవ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట అయ్యప్ప ఆపద్బాంధవ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని పట్టణ సీఐ భాస్కర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా అయ్యప్ప స్వామి భక్తులు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు వనజ, ఎస్ఐ క్రాంతి పాటిల్ మాట్లాడుతూ.. రెండు నెలల పాటు ఈ అంబలి కేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సంయుక్త, కవిత కవిత, అర్చన, భాగ్యలక్ష్మి, మనీలా, స్వాతి, కీర్తన, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ సమ్మేళనంలో పాల్గొన్న మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్

నవతెలంగాణ-రామచంద్రాపురం



భారతినగర్ డివిజన్‌లోని ఎల్ఐజి కమ్యూనిటీ హాల్లో బుధవారం పటాన్చెరు నియోజ కవర్గ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్టియ ‘సన్ సమ్మేళనంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ.. క్రైస్తవుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీటర్ జైపాల్, జాన్ వెస్లీ, సుజీవన్, సునంద్ జోసెఫ్, ప్రవీణ్ సన్నీ శామ్యూల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ దీపక్ జాన్‌ను పలువురు ఘనంగా సన్మానించారు.

నకిలీ డాక్యుమెంట్లతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని కొల్లూరు గ్రామంలో కోట్ల రూపాయలు విలువచేసే భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని కొల్లూరు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉండే మనోజ్ కుమార్ జైన్ అనే వ్యాపారి కొల్లూరు గ్రామంలోని సర్వే నంబర్ 177 లో 2.27 గుంటల భూమిని గతంలోనే ఇతరులకు విక్రయించారు. అయితే పహానిలో మాత్రం భూయజమానుల పేర్లు మార్పు జరగకపోవడంతో ఈ విషయం గ్రహించిన మనోజ్ కుమార్ జైన్.. పహానిలో పేర్లున్న వారి కుటుంబ సభ్యులతో కుమ్మక్కై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆ భూమిని 2006లో తన పేరుపైన రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే ఏదైతే భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడో ఆ భూమి రికార్డులో మాత్రమే ఉంది ఫిజికల్ గా మాత్రం లేదు. ఆ డాక్యుమెంట్లు చూపించి 2023లో కమిడి రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అదే సర్వే నెంబర్‌ని ఇతరుల భూమి హద్దులు చూపించి విక్రయించాడు. అయితే ఆ భూమిని కొనుగోలు చేసిన కమిడి రియాలిటీ సంస్థ వారు మనోజ్ కుమార్ జైన్ చూపించిన భూ హద్దుల ప్రకారం సుభాష్ గౌడ్ అనే వ్యక్తికి సంబంధించిన భూమి చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు. విషయం తెలుసుకున్న సుభాష్ గౌడ్ కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణలో భాగంగా మనోజ్ కుమార్ జైన్ ను అదుపులోకి తీసుకొని వివిధ సెక్షన్ల కింద కేసును నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. ఇదిలా ఉంటే ఎవరైతే లేని హద్దులు సృష్టించిన ఉన్న హద్దులు కాకుండా మరొకరి హద్దులను చూపించినా చట్టప్రకారం శిక్షార్హులు అని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



రఘునందన్ రావు భారీ మెజారిటీతో విజయం సాధించాలని ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు మెదక్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలవాలని బొల్లారం బిజెపి టౌన్ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు టి రవీందర్ రెడ్డి బుధవారం బొల్లారం లోని రామాలయం గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేఘనా రెడ్డి, స్రవంతి రెడ్డి, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్, పూలే జన జాతరను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 23న అంబేద్కర్, పూలే జన జాతరను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), కల్లు గీత కార్మిక సంఘం (కేజీకేఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్‌లు మాట్లడుతూ.. ఏప్రిల్ నెల మహనీయుల పుట్టిన నెల అని.. ఏప్రిల్ 05న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 11 జ్యోతిబాపూలే జయంతి, ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి జయప్రదంగా జరిగాయన్నారు. ఈనెల 23న మహనీయులను స్మరించుకుంటూ సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జన జాతర సాంస్కృతిక కార్య క్రమాలు (ఆటపాట మాట) జిల్లా సదస్సు కార్యక్రమం సంగారెడ్డిలో నిర్వహిస్తున్నామని.. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్, కేవీపీఎస్ రాష్ట్ర కార్య దర్శి స్కైలాబ్ బాబు వస్తున్నారన్నారు. జిల్లాలోని మేధావులు విద్యావంతుల ప్రసంగాలు ఉంటాయని.. కాబట్టి పెద్ద ఎత్తున హాజరై ఈ సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాయవాది సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి దాస్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



వృథాగా పోతున్న మంజీరా నీరు

పట్టించుకోని సంబంధిత అధికారులు

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల్ ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మంజీరా పైపు పగిలి నీరు వృథాగా పోతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకవైపు తాగడానికి నీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతుండగా.. మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో మంజీరా నీరు వృథా కావడం పట్ల పలువురు తీవ్రంగా మండిపడుతున్నారు. తాగడానికి నీరు లేక బోరు బావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని వాపోయారు. అలాంటిది ప్రభుత్వ కార్యాలయం ఎదుటే నీరు వృథాగా పోతున్నా.. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విధులకు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తాన్నారో తెలియని దుస్థితి నెలకొన్నదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మంజీరా నీటి వృథాను అరిట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో దూకి వ్యక్తి మృతి

నవతెలంగాణ-జోగిపేట

రెండ్రోజుల క్రితం ఇంటినుంచి బైక్‌పై వెళ్లిన ఓ యువకుడు చెరువులో దూకి మృతి చెందాడు. ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్, మృతుని భార్య తెలిపిన వివరాల ప్రకారం.. పుల్కల్ మండలం సింగూరు గ్రామానికి చెందిన ఆత్మకూరు బీరయ్య (31) ఈనెల 15న రాత్రి సుమారుగా 11 గంటల ప్రాంతంలో తన బైక్ పై జోగిపేట వైపు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడ ంతో అతని భార్య మాధవి ఫోన్ చేసినా లేపలేదు. కాగా అతడు వ్యక్తిగత కారణాలతో చెరువుల దూకడంతో ఈత రాకపోవడంతో మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

క్రోధి నామ నూతన సంవత్సరంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రోజున సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజుము నుంచే ఆలయాలన్నీ రామనామ స్మరణతో పులకించిపోయాయి. భక్తులు పురవీధుల గుండా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. గురు దత్తాత్రేయ సాహితీ సాయి బాబా దేవాలయ ఆవరణలో సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాలను దర్శించి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు.ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే కు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సి.ప్రభాకర్, విఠల్, లాడే మల్లేశం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

కంది : ధర్మాన్ని కాపాడటంలో రామున్ని మించిన దేవుడు లేడని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మండలంలోని చేర్యాల గ్రామంలో బుధవారం శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొని.. సీతారాముల కల్యాణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్రబంధం భావి తరాలకు ఆదర్శమని, శ్రీ రామచంద్రుడి పాలన ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం కమిటీ సభ్యులు చింతా ప్రభాకర్‌ను ఆలయ మర్యాదలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, సుదీర్‌రెడ్డి, ప్రభాకర్, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, హనుమత్ రెడ్డి, బలరాంరెడ్డి, మాజీసర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్ : శ్రీ రామ నవమి సందర్భంగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ రామాలయంలో పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు భారతదేశ గౌడ సంఘం ఉపాధ్యక్షులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డి.సాయిబాబాగౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రీరాముడి దయవల్ల సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రమైన కల్హేర్‌లోని రామాలయంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాముడు దయవల్ల వర్షాలు సక్రమంగా కురిసి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. అంతకుముందు గ్రామంలోని బసవేశ్వర చౌక్ నుంచి పార్టీ నాయకులతో కలిసి పాదయాత్రగా ఆలయం వరకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు అనిల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు మాల్డొడ్డి సతీష్, కస్ప చంద్రయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు సంగమేశ్వర్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు పండరి, కోశాధికారి సంతోష్, కిరణ్ రెడ్డి, నర్సింలు, అభిలాష్, అరవింద్, నర్సింలు, నవీన్,యువరాజు, రవితేజ, మల్లేష్, రాజు పాల్గొన్నారు.

రామచంద్రాపురం : రామచంద్రాపురం, భారతినగర్, తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరిపారు. పట్టణంలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో జరిగిన సీతారామ కళ్యాణ మహోత్సవంలో భారతినగర్ కార్పొరేటర్ దంపతులు సింధు ఆదర్శ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల్లో సీతారాముల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొని వెళ్లి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీనివాస్‌నగర్ కాలనీలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ దంపతులు పాల్గొని కళ్యాణం నిర్వహించారు. బంగ్లగూడలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో పూజలు, సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని గ్రామాలలో చైర్మన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

ఐడీఏబొల్లారం : పాతబస్తీ, బాలాజీ నగర్, వెంకట్ రెడ్డి నగర్, పోచమ్మ బస్తీ, జిన్నారంలో పలు ఆలయాల్లో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మున్సి పల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని సీతారాముల వివాహాన్ని జరిపించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాములోరి కళ్యాణం విశ్వానికే శుభసూచకమన్నారు. హక్కులకంటే బాధ్యత గొప్ప దని రామతత్వం చాటిందన్నారు. ఈ సందర్భంగా మున్సి పల్ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు చంద్రారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భోజి రెడ్డి, సంపత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కార్మిక నాయకులు వి.వరప్రసాద్‌రెడ్డి, శేఖర్, జె.జెసింగ్, శ్రీమన్నారాయణ, దిననాథ్ , రాజారామ్, శ్రవణ్ , వెంకీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ : అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోనీ వివిధ కాలనీలు, దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చైర్మన్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కల్పన ఉపేందర్ రెడ్డి, చంద్రకళ గోపాల్, కో ఆప్షన్ సభ్యులు రాములు, నాయకులు యాదగిరి, నరసింహ, శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జయలక్ష్మి నగర్ మండే మార్కెట్ శ్రీలక్ష్మి గణపతి శ్రీ కాశీ విశ్వేశ్వర శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్ పట్లోళ్ల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమీన్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నరసింహ గౌడ్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల భాస్కర్ రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ కాలనీలవాసులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామి వారి ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

గుమ్మడిదల : మండలంలోని అన్నారం, దోమడుగు, బొంతపల్లి, గుమ్మడిదల, నల్లవల్లి, కానుకుంట, రామ్‌రెడ్డి బావ్ తదితర గ్రామాల్లో సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు సేవ తదితర కార్యక్రమాలు చేపట్టారు. స్థానికులతో పాటు మండల ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని.. స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అన్నదాన సంతర్పణ వద్ద భోజనాలు చేసి స్వామివారి ముత్యాల తలంబ్రాలు తీర్థప్రసాదాలు తీసుకొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం : మండల కేంద్రమైన జిన్నారంలో గల స్థానిక కోదండ రామాలయంలో శ్రీరామ నవమి పర్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీత రాముల కల్యాణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళ్యాణానికి ముందు గ్రామంలో రామాలయం కమిటీ చైర్మెన్ బురెడ్డి గారి భోజన రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు, ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని ఆలయ కమిటీ బృందం స్థానిక భక్తులు ఆనందోత్సవాల మధ్య చేపట్టారు. సీతారాముల కళ్యాణం తిలకించడానికి పెద్ద సంఖ్యలో జనం హాజరుకాగా కళ్యాణ ప్రాంగణంలో జంటలుగా కూర్చుని సీతారాముల కళ్యాణంను కన్నుల పండుగ్గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, జిన్నారం ఎంపీపీ దమ్మ గౌని రవీందర్ గౌడ్, ఎంపిపి ఉపాధ్యక్షుడు గంగు రమేష్ బీఆర్ ఎస్ రాష్ట్ర నేత వెంకటేశం గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ బురె డ్డి గారి భోజరెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు లావణ్య శ్రీనివాస్ రెడ్డి జనార్ధన్, వెంకటయ్య ఎంపీటీసీలు కోరబోయిన లావణ్య,నాయకులు తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని మాదారం, లక్ష్మీపతి గూడెం, సోలక్పల్లి, దాది గూడెం, ఉట్ల ,వావిలాల, కొడకంచి, శివానగర్, రాళ్లకత్వ గడ్డపోతారం గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల్లో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

పుల్కల్ : పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామంలో సీతారాముల కళ్యాణం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణులు స్వామివారికి అభిషేకం చేశారు. ఆలయ చైర్మెన్ అనంతం దంపతులతో పాటు 15 మంది దంపతులు సామూహికంగా పాల్గొని సీతారాముల కళ్యాణం జరిపించారు. కళ్యాణానికి వచ్చిన భక్తులకు రమేష్ బస్వరాజ్ సొంత ఖర్చులతో అన్నదానం పెట్టారు. అనంతరం ఉత్సాహ విగ్రహాలకు గ్రామంలోని పలు ప్రధాన వీధుల్లో పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిరెడ్డి, పుల్లయ్య గారి సుభాష్, చందర్, శివరత్నం, అంజయ్య పట్నం మల్లేశం, ప్రకాష్, రామచందర్, ఆంజనే యులు, మొగులయ్య, మల్లేశం గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మునిపల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీ నవమి వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. పండుగ సందర్భంగా ఒక్కరోజు ముందుగానే ఆలయాలను విద్యుత్ కాంతులతో ముస్తాబు ఆలయ కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. ముందుగా శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపుగా ఆలయాలకు తీసు కొచ్చారు. అలాగే భాజాభజంత్రీలు, వేదమంత్రాలు, ముత్యా ల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని ఎంతో కమనీయంగా చేశారు. గా మండలంలోని మేళాసంఘం గ్రామంలో హనుమాన్ మందిర్ కమిటీ నిర్వహించిన శ్రీరామకళ్యాణ వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మంపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీరామ కళ్యాణ వేడుకల్లో మునిపల్లి జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం గౌడ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మేతరి మాణయ్య, అర్చకులు అయ్యప్ప స్వామి , గ్రామ పెద్దలు సిద్ధి నర్సింలు, కృష్ణమూర్తి, ఈశ్వరయ్య, కలాల్ వెంకటేశం దంపతులు, కలాల్ నర్సింలు దంపతులు తదితరులు మహిళలు పాల్గొన్నారు.

మండలంలోని చిన్న చిల్మెడ గ్రామంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు రుద్రకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ మందిర్ వద్ద రాములోరి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కుమార్తె త్రిష హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలకృష్ణయ్య, విజయ భాస్కర్, ఉపసర్పంచ్ దత్తుగౌడ్, గ్రామ పెద్దలు, కే పరమేశ్వర్, కమ్మరి నర్సింలు రుద్ర శ్రీధర్ చిన్న సంగమేష్ గొల్ల రాములు బొబ్బిలి సంగమేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలోని పబ్బతి హనుమాన్ ఆలయంలో 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రి కూతురు త్రిష దంపతులు హాజరయ్యారు. అలాగే బీజేపీ ఎంపీ అభ్యర్థి బి.బి పాటిల్ కూడా ఈ కళ్యాణోత్సవంలో పాల్గొని.. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీర హనుమాన్ ఆలయంలో 12వ వార్డు కౌన్సిలర్ కె. నాగరాజు దంపతులు, డాక్టర్ పులుగూ వీణ దంపతులు, బలరాం, రాజు దంపతులు కళ్యాణోత్సవం నిర్వహించారు. అక్కడ జరిగిన కల్యాణోత్సవంలో కూడా మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ మల్లయ్య మాజీ సర్పంచ్ ఎస్.కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఎస్.సురేందర్ గౌడ్, రంగ సురేష్, డాకూరి శంకర్, హరికృష్ణగౌడ్, దుర్గేష్, చందర్, మాజీ మార్కెట్ చైర్మెన్ మల్లికార్జున్, నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు డాకురి వెంకటేశం, పట్లోళ్ల ప్రవీణ్, శివ, నాగయ్య, వినయ్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు గాజుల నవీన్, పులుగు గోపాల్, బీఆర్ఎస్ నాయకులు బిర్లా శంకర్, మహేష్ యాదవ్, అలాగే చాపల వెంకటేశం, నాయికోటి అశోక్ ఆలయాల సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

































ఎంపీపీ, సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరిక

మండలంలో బీఆర్ఎస్ పార్టీకి షాక్

నవతెలంగాణ-నిజాంపేట



మండలంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. బుధవారం ఎంపీపీతో పాటు సర్పంచ్‌లు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, నార్లాపూర్ సర్పంచ్ అమరసేనా రెడ్డి, చల్మెడ సర్పంచ్ నర్సింహ్మా రెడ్డి, రజాక్ పల్లి నాగరాజులు, తిప్పన్నగుల్ల యాదగిరిలతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా అవినీతి మయమైందన్నారు. ఏ పల్లె చూసినా అభివృద్ధికి నోచుకోలేక పోయిందని వారు విమర్శించారు. నేడు ఎమ్మెల్యేగా గెలుపొందిన డా. మైనంపల్లి రోహిత్ వంద రోజుల్లోనే చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాలలోని, నాయకులను కార్యకర్తలను సైతం త్వరలోనే పార్టీలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

వెల్దుర్తిలో పోలీస్ కవాతు

నవతెలంగాణ-వెల్దుర్తి



రానున్న ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకుగాను ముందస్తుగా బుధవారం మండల కేంద్రంలో ఎస్సై నవత గౌడ్ ఇతర మండలాల ఎస్సైలతో కలిసి పోలీస్ కవాతు నిర్వహించారు ప్రజా ప్రతినిధులు ఓటర్స్‌ను భయభ్రాంతులకు చేయకుండా ఉండేందుకే పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ నవత గౌడ్ తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా మీదుగా పోలీస్ కవాతు నిర్వహించారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఎంపీటీసీ

నవ తెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి ఎంపిటిసి సంధ్యారాణి చత్రు నాయక్ బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. హైదరాబాదులోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

చల్మెడలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో, కల్వకుంట వెంకటేశ్వర ఆలయంలో, చల్మెడ గ్రామంలోని శ్రీ సీతారాముల కళ్యాణం వేడుకలను వేద పండితులతో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు చల్మెడ గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ) నర్సింహారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం కనుల విందుగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపి నర్సింహారెడ్డి మాట్లాడుతూ సీతారాముల కళ్యాణం జరిపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. చల్మెడ గ్రామ ప్రజలందరూ పాడిపంటలతో సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆ భగవంతుణ్ణి కోరుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉపసర్పంచ్ రమేష్, బాజే రమేష్, బొమ్మెన మల్లేశం, చప్పేట ముత్యం రెడ్డి, దొంతరబోయిన మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ పోచమ్మ గర్భగుడి ద్వారం ప్రతిష్ఠోత్సవం

హాజరైన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి ఆవుల రాజిరెడ్డి
జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని మహమ్మదాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పోచమ్మ ఆలయ నిర్మాణంలో భాగంగా బుధవారం శ్రీ పోచమ్మ గర్భగుడి ద్వారాన్ని ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్‌లు హాజరై ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఆలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ఆలయాలలో నిత్యం గ్రామస్తులు పూజలు నిర్వహించి గ్రామస్తులందరూ భక్తి భావం కలిగి భక్తి మార్గములో నడవాలని వారు సూచించారు. ఆలయాల నిర్మాణానికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, నాయకులు శ్రీనివాస్ గుప్తా, మణిదీప్,. అశోక్ గౌడ్, ఎద్దు మల్లేష్ యాదవ్, ఆలయ నిర్వాహకులు మల్లేశం, నీరుడి శ్రీశైలం, జైపాల్, బిక్షపతి, శేఖర్, ప్రవీణ్, హనుమంత్ రెడ్డి, పెంటయ్య, లింగం, రాజయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండగగా సీతారాముల కళ్యాణం



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంతోపాటు మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, తుజాల్పూర్ తదితర గ్రామాలలో సీతారాముల కళ్యాణం బుధవారం కన్నుల పండగగా జరిగింది. నర్సాపూర్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో ఉన్న సీతారామాంజనేయ ఆలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరై సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని తుజ్జాల్‌పూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. తుజాల్పూర్ గ్రామంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణంలో భాగంగా ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన స్వప్న రాజా గౌడ్ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



నవతెలంగాణ -పాపన్నపేట

మండల పరిధిలోని గ్రామాల్లోని రామాలయాల వద్ద శ్రీరాముని కళ్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామాలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్రమైన పాపన్నపేటలో సంస్థాన అధిపతుల ఎడ్ల బండితో బండ్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అన్నదాత విలవిల

వర్షానికి తడుస్తున్న వడ్లు అపార నష్టం

నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని చల్మెడ, నిజాంపేట, నందగోకుల్, నస్కల్, కల్వకుంట, రజాక్ పల్లి, నందిగామ, బచ్చు రాజు పల్లి, గ్రామాలలో ఉరుములు, మెరుపులు గాలి దుమారంతో విపరీతంగా వర్షం పడడంతో రైతుల వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. మొన్నటి వరకు వడగండ్ల వానతో రైతులు ఎంతో నష్టపోయారని వడ్లు రాలిపోయినవి. రైతు కోలుకోక ముందే అకాల వర్షం రావడంతో అన్నదాత విలవిల కొట్టుకుంటున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రసవత్తరంగా మారనున్న నర్సాపూర్ రాజకీయం

- భారీ మెజారిటీ అందించేందుకు ఆయా పార్టీల ప్రయత్నాలు
- మదన్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో బీఆర్ఎస్‌కు భారీ నష్టం
- బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు మదన్ రెడ్డి ప్రయత్నాలు
- కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే సునీత రెడ్డి ప్రయత్నాలు
- సునీత రెడ్డి పట్టించుకోవడం లేదంటూ నాయకుల అసంతృప్తి

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారనుంది. ఎంపీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఆయా పార్టీల నాయకులు నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎలాగైనా ఎంపీ అభ్యర్థికి నర్సాపూర్ నియోజకవర్గం భారీ మెజారిటీ అందిచ్చి తమ సత్తా చాటాలని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్నటి వరకు నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉండేది. గత మూడు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు, పిఎసిఎస్ చైర్మన్‌లు, మాజీ సర్పంచులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఒక్కసారిగా బిఆర్ఎస్ పార్టీకి భారీ నష్టం జరిగింది. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపడిందని నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ రావడం ఖాయమని ఆ పార్టీకి చెందిన నాయకులు చర్చించుకుంటున్నారు.

బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు మదన్ రెడ్డి ప్రయత్నాలు

నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీసేందుకు మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు మెదక్ ఎంపీ టికెట్ ఇస్తానని హామీ ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానాన్ని త్యాగం చేసిన విషయం తెలిసిందే. అయితే ఎంపీ టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని మనస్థాపంతో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి గత మూడు రోజుల క్రితం తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. అయితే తనకు ఎంపీ టికెట్ ఇవ్వకుండా మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని నర్సాపూర్ నియోజకవర్గంలో దెబ్బతీయాలనే ఆలోచనతో మదన్ రెడ్డి ఉన్నట్లు సమాచారం. అందులో భాగంగానే నియోజకవర్గంలో ఉన్న ప్రజాప్రతినిధులను, మాజీ ప్రజాప్రతినిధులను, బీఆర్ఎస్ ముఖ్య నాయకులను, నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్పించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. అందుకోసం తన అనుచరులను రంగంలోకి దింపి బీఆర్ఎస్ నాయకులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఎంపీ ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో నుంచి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ అందించి తన సత్తా ఏమిటో చూపించాలని మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి గట్టి ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు సునీత రెడ్డి ప్రయత్నాలు



అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుతం ఎమ్మెల్యే సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు కలిసి పని చేశారు. సునీత రెడ్డి విజయం కోసం మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఎంతో కృషి చేశారు. అయితే తనకు ఎంపీ టికెట్ ఇవ్వకుండా బిఆర్ఎస్ అధిష్టానం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యే సునీత రెడ్డి బిఆర్ఎస్ పార్టీలో ఒక్కరే ముఖ్య నాయకురాలుగా చలామణి అవుతున్నారు. చాలామంది బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. నాయకులు పోయినంతమాత్రాన బీఆర్ఎస్ పార్టీకి ఎటువంటి నష్టం లేదని గ్రామాలలో బలమైన కార్యకర్తలు ఉన్నారనే ఉద్దేశంతో ఎమ్మెల్యే సునీత రెడ్డి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థికి భారీ మెజార్టీ అందించేందుకు శతవిధాల ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా బీఆర్ఎస్‌లో ఉన్న నాయకులను కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా ఎప్పటికప్పుడు కట్టడి చేస్తున్నట్లు తెలిసింది.

సునీత రెడ్డిపై నాయకుల అసంతృప్తి

ఎమ్మెల్యే సునీత రెడ్డిపై అదే పార్టీకి చెందిన నాయకులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. పార్టీలో ఎమ్మెల్యే సునీత రెడ్డి కొందరికి మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నారని పార్టీ నాయకులు కొందరు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. అదే కారణంతో హత్నూర మండలంలో పెద్ద సంఖ్యలో నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. ఇప్పటికైనా సునీత రెడ్డి తమను పట్టించుకోకపోతే పార్టీని వీడేందుకు సిద్ధపడినట్లు తెలిసింది.

ప్రజల్లోకి వెళ్లి బీజేపీ ప్రచారం

నర్సాపూర్ నియోజకవర్గంలో బీజేపీ ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కంటే ముందే బీజేపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. బిజెపి నాయకులు ఎప్పటికప్పుడు కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారం కొనసాగిస్తున్నారు.

నేటి నుంచి నామినేషన్ల ఘట్టం షురూ..

ఈనెల 25 వరకు స్వీకరణ
ముహూర్తాలు ఫిక్స్ చేసుకున్న అభ్యర్థులు
మెదక్‌కు రానున్న తెలంగాణ, గోవా సీఎం లు

నవతెలంగాణ-మెదక్

పార్లమెంట్ ఎన్నికల సందడి జోరందుకుంది. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ కొనసాగనుండటంతో లోక్‌సభ ఎన్నికల తొలి ఘట్టం ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ముహూర్తాలను ఫిక్స్ చేసుకున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, సంగారెడ్డి, పటాన్ చెరువు మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్స్‌లలో ఓటరు జాబితా సవరణ తుది ఓటరు జాబితా ప్రకారం 18 లక్షల 12 వేల 858 మంది ఓటర్లు ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో 2098 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 18 గురువారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 25 వరకు కొనసాగనుంది. మెదక్ కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ నామినేషన్లను స్వీకరించనున్నారు. పనిదినాల్లో ఉదయం 11 నుంచి 3 గంటల వరకు మాత్రమే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ అభ్యర్థులు రూ.12,500 చెక్, చలానా రూపంలో సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థులు రూ. 95 లక్షల వరకు మాత్రమే ఎన్నికల ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 26న నామినేషన్ల స్క్రూటినీ, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఫలితాలను విడుదల చేయనున్నారు.

నామినేషన్ల నుంచే వ్యూహాత్మకం:

లోక్ సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆయా పార్టీలు పావులు కదుపుతున్నారు. ఎన్నికల తొలి ఘట్టం అయిన నామినేషన్ల ప్రక్రియ నుంచే ప్రధాన రాజకీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బిజేపీ, బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నారు. నామినేషన్లను సరికొత్తరీతిలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగేలా సన్నాహాలు చేస్తున్నారు. మెదక్ పార్లమెంట్‌కు సంబంధించిన బిజెపి, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసేందుకు ఏకంగా సీఎంలతో కలిసి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, గోవా సీఎం ప్రమోద్ సావంత్ మెదక్ పట్టణానికి తమ అభ్యర్థుల తరపున ప్రచారం చేసేందుకు రానున్నారు. మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఈ నెల 20వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కోల్చారం మండలం రాంపూర్ చౌరస్తా నుంచి కలెక్టరెట్ వరకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు నీలం మధు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్రానికి సీఎం అయిన తర్వాత రేవంత్ రెడ్డి మెదక్ పట్టణానికి రావడం తొలిసారి కావడంతో ఘనస్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిదంగా మెదక్ పార్లమెంట్ బిజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఈనెల 18న గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. రఘునందన్ రావు నామినేషన్‌కు గోవా సీఎం ప్రమోద్ సావంత్ హాజరుకానున్నారు. అదే రోజు సాయంత్రం మెదక్ జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసంగించనున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ప్రచారంలో దూసుకుపోతున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదేమైనా నామినేషన్ల తొలి రోజు నుంచే మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల సందడి వేడెక్కనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కన్నుల పండువగా సీతారామ కళ్యాణం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ - మెదక్



శ్రీరామనవమి వేడుకలు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. జిల్లాలోని ఆయా ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మెదక్ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి మెదక్ ఎమ్మెల్యే దంపతులు మైనంపల్లి రోహిత్, శివాని రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దంపతులు పద్మాదేవేందర్ రెడ్డిలు హాజరయ్యారు. పూజారి భాష్యం మధుసుదనాచారి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు నృత్యాలు చేస్తూ మాలల మార్పిడి చేయా క్రతువు పూర్తి చేశారు. రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే దంపతులు సీతారాముల కళ్యాణంలో ఓకే వేదిక మీద కూర్చొని పూజలో పాల్గొనడం ఆసక్తికరంగా మారింది. మెదక్ పట్టణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీరామ జయరామ జయ జయ రామ అంటూ భక్తుల రామ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడటంలో రామున్ని మించిన దేవుడు లేడని, సీతారాముల పవిత్రబంధం భావితరాలకు ఆదర్శమని, శ్రీ రామచంద్రుడి పాలన ప్రపంచ



దేశాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆ సీతారాముల ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ చంద్రపాల్, నాయకులు జీవన్ రావు, బొజ్జ పవన్, శ్రీనివాస్ చౌదరి, శంకర్, ఆలయ ఛైర్మెన్ బండ నరేందర్, కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

కళ్యాణం కమనీయం

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం
ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి
జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కోడలు రచనా పాటిల్

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్



శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పెద్దశంకరంపేట రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేకంగా అలంకరించిన పూలపందిరిలో సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. పలువురు గ్రామ పెద్దలు స్వామివారికి పట్టు వస్త్రాలు పుస్తె మట్టెలు ఓడిబియ్యం తదితర సామాగ్రిని సమర్పించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కోడలు రచనా పాటిల్ తదితరులు కళ్యాణ మహోత్సవానికి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు యువకులు గ్రామస్తులు కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచులు అలుగుల సత్యనారాయణ, కుంట్ల రాములు గ్రామ పెద్దలు నాయకులు వేణుగోపాల్ గౌడ్, మురళి పంతులు దాదిగారి గంగాధర్ సురేందర్ రెడ్డి, రాయిని మధు, నారా గౌడ్ దాచ సంగమేశ్వర్, కందుకూరి రవీందర్ అన్నారం సత్యనారాయణ దస్వంత్ నర్సింలు చారి రాగం సిద్దు శ్రీనివాస్ సంతోష్ సీతారామారావు సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి వ్యక్తి దుర్మరణం

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

నవతెలంగాణ-నార్సింగి



మద్యానికి బానిసైన ఒంటరి మనిషి తన రూంలో మరణించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి గ్రామానికి చెందిన వీరప్ప నారాయణ (50)కు గతంలో ఘనపురంకు చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. వారికి కూతురు రజిత జన్మించిన అనంతరం నారాయణ భార్య లక్ష్మి ఆరోగ్య కారణాలతో మృతి చెందారు. అనంతరం నారాయణ వెంకటరావు పేట్‌కు చెందిన గంగవ్వను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కూతుళ్లు పుట్టిన అనంతరం దాదాపు 25 సం క్రితం కుటుంబ కలహాల వల్ల గంగవ్వ నారాయణను వదిలి తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న నారాయణ మద్యానికి అలవాటు పడి నార్సింగిలో ఉంటూ ఎక్కడో ఒక దగ్గర తింటూ, కాస్య తాండా చెరువు కట్టపై ఉన్న రూములో ఒంటరిగా ఉంటున్నాడు. పెళ్లి అయిన పెద్ద కూతురు రజిత వద్దకు అప్పుడప్పుడు వెళ్లి కొద్ది రోజులు ఉండి వచ్చే వాడు. కూతురు వద్దకు వెళ్లాడని నారాయణ అక్క ఈరప్ప సత్తవ్వ అనుకుంటున్న తరుణంలో ఏప్రిల్ 16న సాయంత్రం గ్రామస్తులు మీ తమ్ముడు రూంలో చనిపోయి ఉన్నాడని తెలిపారు. సత్తవ్వ కొద్ది మందితో పాటు వెళ్లి చూడగా నారాయణ మృతి చెంది ఉన్నాడు. సత్తవ్వ వెంటనే విషయాన్ని పోలీసులకు తెలుపగా ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ సిబ్బందితో వెళ్లి నారాయణ మృత దేహాని పరిశీలించగా, అతను చనిపోయి రెండు రోజులు కావచ్చని అంచనా వేశారు. అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం రామాయంపేట ఆసుపత్రికి తరలించారు. నారాయణ అనారోగ్య కారణాలతో మరణించాడని, తమకు అతని మృతి పై ఎలాంటి అనుమానాలు లేవని సత్తవ్వ తెలిపారు. మృతుని అక్క సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ పేర్కొన్నారు.

నేటి సమావేశాన్ని విజయవంతం చేయాలి

దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-చేగుంట

కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు పథకాలల్లో కొన్ని పథకాలు అమలులో ఉన్నాయని, మిగిలిన పథకాలు త్వరలోనే పూర్తి చేస్తామని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చేగుంట మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం జరగబోయే మెదక్ పార్లమెంటు సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని అక్బర్ పేట్ భూంపల్లి ఎక్స్ రోడ్‌లోని ఎస్ బి ఆర్ గార్డెన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జి కొండా సురేఖ, పార్టీ అభ్యర్థి నీలం మధు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ మైనంపల్లి హనుమంతరావు, పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, మాజీ సర్పంచ్ కాశ బోయిన భాస్కర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రాజేందర్, నాయకులు సంద్రుగు శ్రీకాంత్, బోయిని శ్రీకాంత్, జూకంటి రాజా గౌడ్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలవాలని ముడుపు

నవతెలంగాణ-నంగునూరు

మెదక్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి పి. వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాలని తుల్జాపూర్ భవాని మాతకు ముడుపు కట్టినట్టు నంగునూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగు పురేందర్ తెలిపారు. బుధవారం మహారాష్ట్ర సోలాపూర్ లో శ్రీరామనవమి సందర్భంగా తుల్జాపూర్ తుల్జా భవాని మాతా కి ప్రత్యేక పూజలు చేశామని చెప్పారు.అలాగే తెలంగాణ బీఆర్ఎస్ పార్లమెంట్ మొత్తం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని తుల్జా భవాని మాతను ప్రార్థించామన్నారు. బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు అనంతారం రఘుపతి, సోలాపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందికట్ల రఘురాములు, శ్రీనివాస్ తదితరులు హాజరైనారన్నారు.



కూర పండరినాథ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిద్దిపేట

గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొంది, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సిద్దిపేట ప్రముఖ వ్యాపార వేత్త, ఆధ్యాత్మిక సామాజిక సేవాతత్పరుడు కూర పండరి నాథ్ ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పరామర్శించారు. తన ఆరోగ్య పరిస్థితి అడిగి తెల్సుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు, వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుమారులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





25కోట్ల లిఖిత రామ నామాలతో శ్రీరామునికి అభిషేకం

నవతెలంగాణ-గజ్వేల్

శ్రీరామనవమిని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వారి ఆధ్వర్యంలో 25కోట్ల లిఖిత శ్రీరామ నామాలతో సీతారాములకు ప్రత్యేక అభిషేకాలు అద్దాల మందిరం వద్ద సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామనామ స్మరణ చేస్తే ఆనందం లభిస్తుంది. ఆ నామంలో ఉన్న మంత్రశక్తి మనలో దుఃఖాల్ని సమూలంగా నాశనం చేసి ఆనందాన్ని ఇస్తుందన్నారు.



ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామం లో అప్పుల బాధ తో నెల రోజుల క్రితం చిగురు స్వామి రైతు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారు. భార్య ,పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబం ఆర్థికం గా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న గజ్వేల్ కు చెందిన మనం ఫౌండేషన్ 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు గొడుగు స్వామి,ప్రధాన కార్యదర్శి కనకయ్య ,కోశాధికారి ఆంజనేయులు,మల్లికార్జున్ పాల్గొన్నారు.



ఆత్మహత్య చేసుకున్న మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-తొగుట

ఆత్మహత్య చేసుకున్న మిత్రుని కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సహాయం అందించారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన చిక్కు డు శ్రీని వాస్ కొద్దిరోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితుడైన శ్రీనివాస్ మృతి చెందడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిక్కుడు కుమారు, రఫీ, గిరి బాయ్, ఎం. స్వామి, బాల్ రెడ్డి మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ మాలాధారణ స్వాముల ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-మద్దూరు

శ్రీరామనవమి సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో హనుమాన్ మాలాధారణ స్వాముల ఆధ్వర్యంలో. ఆంజనేయ స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొ ని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



మాదిగలను మోసం చేస్తున్న సీఎం

నవతెలంగాణ-గజ్వేల్

పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు ఒక సీటు కూడా కేటాయించకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలను మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు మైస రాములు, కృష్ణ, పరశు రాములు అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తాను అనుకూలమని చెప్పి మాదిగలతో ఓట్లు వేయించుకున్నారని పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క స్థానమూ కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీహరి సింధు, రమేష్, ఆంజనేయులు, రవీందర్, స్వామి, ప్రశాంత్, కర్ణాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌ను ఎంతో అభివృద్ధి చేశాం

బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించండి.. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామి రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రచార రథాలను వారు ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని వారు గుర్తు చేశారు. గజ్వేల్ అభివీద్ధిలో మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకట రామిరెడ్డి కృషి కూడా ఉందని వారు అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని 175 గ్రామాల్లో అభివృద్ధిని చేపట్టిన ఘనత కేసిఆర్కే దక్కిందన్నారు. పేదలకు రూ రెండు వేల పెన్షన్ ఇచ్చిన ఘనత కేసీఆర్ కి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ 4000 రూపాయలు పెంచుతామని చెప్పి ఇంతవరకు పెంచలేదన్నారు. మాటలతో కాంగ్రెస్ కాలం గడుపుతుందని వారు అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందేలా కేసీఆర్ కృషి చేసినట్లు వారు గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో వెంకట్రామి రెడ్డిని గెలిపించి కేసీఆర్కు బహుమానం ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, జెడ్పిటిసి మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్టారెడ్డి, సింగల్ విండో చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు నాగరాజు, నవాజ్ మేరా, కౌన్సిల్ సభ్యులు లక్ష్మీ కిషన్ రెడ్డి, గుంటుక శిరీష రాజు, అత్తిలి శ్రీనివాస్, బాలమణి శ్రీనివాస్ రెడ్డి, గన్ శెట్టి చందన రవీందర్, చందు, పాల రమే ష్ గౌడ్, హైమద్, స్వామి చారి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-సిద్దిపేట

వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర అగ్నిమాపక ఇంచార్జీ ఆఫీసర్ నరేష్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో హాస్పిటల్ లు, ఇతర రద్దీ గల ప్రదేశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన, అగ్నిప్రమాదం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు తెలిపారు. ఎల్లప్పుడూ అగ్నిమాపక సాధనాలను అందుబాటులో ఉంచుకోవాలని, వాటిని తరచూ తనిఖీ చేసుకోవాలని దుకాణదారులకు సూచించినట్లు తెలిపారు. బహుళ అంతస్తుల ప్రదేశాలలో సిబ్బంది, ఉద్యోగులు తప్పనిసరిగా అగ్నిమాపక సాధనాలను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలని సూచించారు. పట్టణంలో ఎక్కువగా విద్యుత్ , ఎలక్ట్రికల్ ఉపకరణాలవల్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నందువల్ల ఎల్లప్పుడూ ఐఎస్ఐ మార్కు గల వైర్లు , ఉపకరణాలను ఉపయోగించాలని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో షాపుల యందు విద్యుత్ ఆఫ్ చేసి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మాన్ నరేష్, ఫైర్ స్టేషన్ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం పద్మశాలీలు, చేనేతలు కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాదులో కలిసినట్లు తెలిపారు. మెదక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నీలం మధును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించినట్లు తెలిపారు. చేనేతల అభివృద్ధి కోసం త్వరలోనే నూతన పథకాలను తీసుకురానున్నట్లు తెలిపినట్లు తెలిపారు. చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆరు గ్యారెంటీ ల పథకాల అమలు తీరు, ప్రజల నుంచి వస్తున్న స్పందన గురించి సీఎం అడిగినట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం మరిన్ని ప్రజలకు అవసరమగు పథకాలను, తాము ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి వివిధ పథకాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీఎం సూచన మేరకు మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం పద్మశాలీలందరం, చేనేతలు అందరం ఐక్యంగా ఉండి ఓట్లు వేసి గెలిపించేందుకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంటుందని, ముఖ్యమంత్రి ప్రజలందరికీ, నాయకులందరికీ అందుబాటులో ఉండి కలవడం సంతోషంగా ఉందన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న ఇతర పార్టీల నాయకులు



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ దినదినాభివృద్ధి చెందుతుందని డిసిసి అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ, బిఆర్ఎస్, నాయకులు జంగం వెంకట్ గౌడ్, రాజా గౌడ్‌లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తూముకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజాపాలన వలన కాంగ్రెస్ పార్టీలో పలు పార్టీల నాయకులు భారీగా చేరుతున్నట్లు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొనగారి రాజు పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంగారు రెడ్డి బెజగామా శివారెడ్డి, వు డెం శ్రీనివాస్ రెడ్డి, అక్కారం యాదగిరి, సుక్కం సురేష్, ఆంజనేయులు యాదవ్, మామిడి కృష్ణ, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



వీరాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం కోసం రెండు లక్షల విరాళం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం జేపీ తండా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ దుర్గా వీరాంజనేయ స్వామి దేవాలయానికి మహేంద్ర గ్రూప్ ఆఫ్ చైర్మన్ తడిసిన ప్రశాంత్ రెడ్డి రెండు లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారని గ్రామ తాజా, మాజీ సర్పంచ్ భూక్యా బిక్షపతి నాయక్ తెలిపారు. చిన్నతనంలోనే ఎంతో కష్టపడి నేడు పెద్ద బిజినెస్ మాన్‌గా పేరు ప్రతిష్టలు పొందారన్నారు. ప్రశాంత్ రెడ్డికి ఎల్లప్పుడూ మంచి జరగాలని శ్రీ దుర్గా వీరాంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నా మని చెప్పారు. దేవాలయ కమిటీ తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్, వీరా నాయక్, సంపత్ నాయక్, రమేష్ నాయక్, రాజు, రమేష్, మల్లేష్, బంగ్లా, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కాకతీయలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-సిద్దిపేట

కాకతీయ టెక్నో హైస్కూల్లో మంగళవారం సాయంత్రం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ..ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీ క్లాసులకు, ప్రమోషన్ క్లాసులకు వెళుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్ననాటి నుండి విద్యార్థులను చదువు, సంస్కృతి,సేవా తత్పరతను, అలవడే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఉద్బోధించారు. ప్రమోషన్ క్లాసులకు వెళుతున్న విద్యార్థులకు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు, చదువుకున్న పాఠశాలకు, కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రజలకు ఎంతో మేలు



నవతెలంగాణ-గజ్వేల్

చలివేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళితో కలిసి చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్బు సభ్యులు తీసుకున్న నిర్ణయం చాలా మంచిదన్నారు. వేసవి ఎండలకు ప్రయాణికులు పాదాచారులకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు సిద్ధి బిక్షపతి చేతుల మీదుగా ప్రారంభం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వాసవి క్లబ్ సేవలు అభినందనీయం అని వాసవి క్లబ్ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని వేసవి లో ప్రజలకు అందుబాటులో చలివేద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్య గారి. శేఖర్, ప్రధాన కార్యదర్శి సిద్ది నవీన్, కోశాధికారి వెంకటేష్, వాసవి క్లబ్ కార్యవర్గం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నంగునూరి సత్యానారాయణ, అత్తెల్లి లక్ష్మయ్య, భద్రయ్య, గోలి సంతోష్, అయిత సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్, కాశీనాథ్, కైలాస ప్రశాంత్, ఉమేష్, గంగా రమేష్, దూబకుంట లచ్చల్, సిద్ధేశ్వర్, సంపత్,సిరిపురం సత్యనారాయణ, జిల్లా ప్రసాద్, కాపర్తి సంతోష్ , నేతి గౌరీ శంకర్,,నితీష్, బొచ్చు రవి, రాము, రవి, గందే సంతోష్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రామరాజ్యాన్ని తలపించిన కేసీఆర్ పాలన..




నవతెలంగాణ-దుబ్బాక

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కత్తి కార్తీక గౌడ్ విమర్శించారు.మాజీ సీఎం కేసీఆర్ పాలన రామ రాజ్యాన్ని తలపించిందని,ఆయన పరిపాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని గుర్తు చేశారు.బుధవారం శ్రీరామనవమి సందర్భంగా దుబ్బాకలోని శ్రీ వెంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కత్తి కార్తీక గౌడ్ ఇంటి నుంచి తలంబ్రాలను అందజేశారు.కళ్యాణ మహోత్సవ అనంతరం తన సొంత ఖర్చులతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీతారాముల ఆశీస్సులు యావత్ తెలంగాణ ప్రజలపై ఉండి ,పాడిపంటలు సమృద్ధిగా పండాలని రామున్ణి వేడుకున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్,16వ వార్డ్ కౌన్సిలర్ దేవుని లలిత చంద్రయ్య,మాజీ జెడ్పీటీసీ అబ్బుల రాజలింగం గౌడ్,పలువురున్నారు.

పార్టీ కోసం ఎంతో కష్టపడ్డా

బీఆర్ఎస్ సీనియర్ నేత బివి రావు



నవతెలంగాణ-గజ్వేల్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఉద్యమం చేపట్టిన నాటి నుండి 2023 వరకు పార్టీ కోసం ఎంతో కష్టపడినట్లు బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నేత బివి రావు అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీని నమ్ముకొని పనిచేసిన నాయకులకు పార్టీలో విలువ లేదని ఆయన ఆవేదన చెందారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 14 సంవత్సరాల పోరాటం తర్వాత తెలంగాణ రాష్ట్రం సాధించామని పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా తమను పట్టించుకోలేదని ఆయన ఆవేదన చెందారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా సమావేశాలకు సమాచారం ఇవ్వడం లేదని ఆయన అన్నారు. పార్టీ కోసం వాల్ రైటింగ్ సైతం రాసినట్లు ఆయన గుర్తు చేశారు. గజ్వేల్ నియోజకవర్గం లో పార్టీ సీనియర్లను కూడా పట్టించుకోకపోవడం వల్లనే చాలా మంది పార్టీ మారుతున్నారని ఆయన ఆవేదన చెందారు. గజ్వేల్ నియోజకవర్గం నుండి మూడుసార్లుగా శాసనసభ్యులుగా గెలిచిన కేసీఆర్ గజ్వేల్ కు రాకపోవడం కార్యకర్తలకు నాయకులకు అసంతృప్తిగా ఉందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి స్థాయిలో గజ్వేల్ లో అభివృద్ధి జరగలేదని ఆయన స్పష్టం చేశారు. మధ్యవర్తుల వల్ల గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధికి పూర్తిస్థాయిలో నోచుకోలేదని ఆయన అన్నారు. కేసీఆర్ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని ఆయన చెప్పారు. దాంతో అభివృద్ధి జరగలేదన్నారు. గజ్వేల్ ను జిల్లా చేయటానికి కేసీఆర్ సిద్ధపడినా కొందరు నాయకులు అడ్డుకున్నారని ఆయన గుర్తు చేశారు. పార్టీలో కొందరికి ప్రాధాన్యతిస్తూ పదవులు పనులు ఇచ్చారని ఆయన అన్నారు.

చందాపూర్ విద్యార్థికి కథల పోటీలో మొదటి బహుమతి



నవతెలంగాణ-తొగుట

చందాపూర్ విద్యార్థికి కథల పోటీలో మొదటి బహుమతి సాధించడం గొప్ప విషయం అని మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి తెలిపారు. సిద్దిపేటకు చెందిన సుగుణ సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థుల కోసం కథల పోటీలు నిర్వ హిస్తారని వివరించారు. పోటీలలో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుండి దాదాపు 270 కథలు వచ్చాయని తెలిపారు. పోటీలలో విజేతల కు సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో మంగళవారం బహుమ తులు అందజేచేశారని అన్నారు. ఈ పోటీలలో మండలంలోని చందాపూర్ ప్రాథమికోన్నత పాఠ శాలకు చెందిన విద్యార్థి పి. అభిలాష్ సాధించాడని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుగుణ సాహితీ సమితి కన్వీనర్ బైతి దుర్గం, పాఠశాల ప్రధానో పాధ్యాయులు గరిపల్లి సిద్దేశ్వర్ బహుమతి ప్రదానం చేశారు. మండలంలోని తమ పాఠశాల విద్యార్థికి కథల పోటీలో మొదటి బహుమతి వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం 2023 సంవత్సరంలో చందాపూర్ విద్యార్థి మొదటి బహుమతి సాధించారని, తమ పాఠశాలకు మొదటి బహుమతి సాదించాడని తెలుగు ఉపాధ్యాయుడు అనిశెట్టి సతీష్ కుమార్ కృషి ఎంతో ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గరిపల్లి సిద్దేశ్వర్ తెలిపారు. అలాగే ప్రతీ అంశంలో చందా పూర్ పాఠశాల జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తు న్నందుకు ఆనందంగా ఉందని, అలాగే బహుమతి గెలుచుకున్న విద్యార్థికి అభినందనలు తెలిపారు.

సువర్ణ ప్రాసన సంస్కారం



నవతెలంగాణ-సిద్దిపేట

అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో చిన్నపిల్లలకు సువర్ణ ప్రసన సంస్కారం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా 3వ గవర్నర్ గంధసిరి కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాసన చిన్నాంపలకు, పిల్లలకు చాలా ఉపయోగకరమైనదనీ, ఆరు నెలల నుండి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ సుమారు 200 మంది పిల్లలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పిల్లల్లో గల బుద్ధి మాంద్యం తగ్గించడానికి, మేధో శక్తి పెంచడానికి, జ్ఞాపక శక్తి పెరగడం, రోగ నిరోధక శక్తి పెరగడం, చురుకుదనం, బలాన్ని పెంచడం, కలర్ కాంప్లెక్స్ పెంచడం, రోజువారి చదువులో గ్రహణ శక్తి, వినే శక్తి సామర్థ్యం పెరగడం, జెనెటికల్గా ఇంప్రూవ్మెంట్ కోసం ఈ సువర్ణ ప్రాసనా సంస్కారం 100 శాతం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ చకిలము బాలచంద్రము, ఫాస్ట్ ఇంటర్నేషనల్ కమిటి చైర్మన్ ఆత్మ రాములు, పెద్ది వైకుంఠం, వైస్ గవర్నర్లు పెద్ది రామచంద్రం, గందెశిరి కృష్ణమూర్తి, జూలూరి లక్ష్మీనారాయణ, సరస్వతి శిశు మందిరి యాజమాన్యము , ప్రిన్సిపల్ నరేష్ ఆచార్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన బిజెపి , బీఆర్ఎస్ నాయకులు బుధవారం నాడు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ ల ఆధ్వర్యంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నర్సారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుమారు 50 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం అందరూ కష్టపడి పనిచేయాలని నర్సారెడ్డి సూచించారు. కాంగ్రెస్ గెలిస్తేనే రైతులు బాగుపడతారని అన్నారు. మళ్ళీ ఇందిరమ్మ రాజ్యం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, నాయకులు రాజేందర్ రెడ్డి, మునీర్, తిరుపతి రెడ్డి, నాయకులు వెంకట్ రాంరెడ్డి, అమరేందర్ రెడ్డి ,నర్సింలు,విద్యాధర్ , అశోక్ , కనకయ్యస్వామి, కార్యకర్తలు ఉన్నారు.

రాముని ఆశీస్సులు దుబ్బాక ప్రజలపై ఉండాలి : ఎమ్మెల్యే

నవ తెలంగాణ -దుబ్బాక



రాముని ఆశీస్సులు దుబ్బాక ప్రజలపై మెండుగా ఉండాలని ఈ ప్రాంతంలో వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని రామున్ని వేడుకున్నట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చెప్పారు.బుధవారం శ్రీరామనవమి సందర్భంగా దుబ్బాక మండల పరిధిలోని ఎమ్మెల్యే స్వగ్రామం పోతారంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మంజులత దంపతులు పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కళ్యాణ మహోత్సవంలో పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు,పోతారం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

నవతెలంగాణ - కొమురవెల్లి



శ్రీరామనవమి సందర్భంగా మండలంలో సీతారాముల కళ్యాణం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం కొమురవెల్లి మల్లికార్జున ఆలయ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా సీతారాములకళ్యాణం నిర్వహించారు. కిష్టంపేట, గౌరయపల్లి, మర్రి ముచ్చాల, గురువన్న పేట గ్రామాలలో శ్రీరామ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి దంపతులు, మల్లన్న ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏతఃఓ బుద్ధి శ్రీనివాస్, అర్చకులు మధుసూదన శర్మ, ఆలయ ధర్మకర్తలు పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం

కనుల పండుగగా సీతారాముల కల్యాణం

కల్యాణ మహోత్సవానికి హజరైన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-మర్కుక్

శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని అంగడికిష్టాపూర్, పాములపర్తి, మర్కుక్, కాశిరెడ్డిపల్లి, దామరకుంట, తదితర గ్రామాలలో సీతారాములకల్యాణం అంత్యంత వైభవంగా కనుల పండుగగా బుధవారం నిర్వహించారు. అంగడికిష్టాపూర్‌లో తాజా మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీరాములు గౌడ్, ఉమామహేశ్వర ఆలయ చైర్మన్ బల్లి శ్రీనివాస్ గుప్త, పాములపర్తిలో నాచారం ఆలయ చైర్మన్ హరిపంతులు, మర్కుక్‌లో తాజా మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్,కాశిరెడ్డిపల్లిలో అప్పాల శ్రీనివాస్, దామరకుంటలో గుండు శ్రీనుగోపాల శర్మ ల అద్వర్యంలో, గంగాపూర్‌లో 21 మంది దంపతులు సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పురోహితులు గుండబట్ల వెంకట నర్సింహ శర్మ, కార్తీక్ శర్మ,శ్రీనివాస్ శర్మ, ఉపసర్పంచ్ కోండల్ రెడ్డి, యాదవరెడ్డి, మీసాల శ్రీనివాస్ రెడ్డి, ముద్రాతి బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కుమ్మరి కనకయ్య, కమ్మరి నర్సింహ్మాచారి, బాల్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, రాముగౌడ్, గడీల వెంకటేష్, తిరుపతి, పత్తి నర్సింలు యాదవ్, సాయిని మహేష్, భాస్కర్ రెడ్డి, గుండ శ్రీను, కర్ణణాకర్ రెడ్డి, సత్యనారాయణ, బాపు రెడ్డి భాస్కర్, దామోదర్ రెడ్డి, శ్రీను,రాజు, సంజీవరెడ్డి తదితరులున్నారు.

నవతెలంగాణ-కోహెడ

మా ఊరి దేవుడు, అందాల రాముడు అంటూ మండల కేంద్రంతో పాటు మండలంలోని రాంచంద్రాపూర్, బస్వాపూర్, శ్రీరాములపల్లి, గొట్లమిట్ట, కూరెళ్ళ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో డాక్టర్ ప్రసాదరావుశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల పెళ్ళి మంత్రోచ్చరణతో కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు గ్రామస్థుల రాకతో ఆలయం కిక్కిరిసి పోయింది. అలాగే బస్వాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణ వేడుకలలో ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ పాల్గోన్నారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి, ప్రజలు సుఖ సంతోషాలతో మెదలాలని కోరుకున్నారు. అనంతరం ఆయా గ్రామాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మహిళలు, గ్రామస్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో శ్రీరామనవమి పురస్కరించుకొని పురాతన రామాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, గాజులు, పండ్లు, పువ్వులు అందజేసినట్టు ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ గంప శీను వాస్ తేలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఇలాంటి సేవ చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంప కృష్ణమూర్తి, పుల్లూరి శివకుమార్, పుల్లూరి శశాంక్ , జోన్ చైర్మన్ చింత రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చకిలం రవి, కోశాధికారి ఇల్లెందుల నాగేందర్, పి ఆర్వో సోమ దుర్గయ్య అల్లాడి వెంకటేశం, బురుగు వేణుగోపాల్, కసన్న గొట్టు నాగరాజు, పోషణాతం నాగేందర్, శంకర్, శ్రీనివాస్, హరికిరణ్, వాసవి మిత్రులు, అన్నపూర్ణేశ్వరి యూత్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు .

నవతెలంగాణ-నంగునూరు

శ్రీరామనవమి పురస్కరించుకుని బుధవారం నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.నంగునూరు, మగ్దుంపూర్,అక్కెనపల్లి,కొండంరాజ్ పల్లి, గట్ల మల్యాల, పాలమాకుల, రాజగోపాల్ పేట తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కనులారా తిలకించారు. ఆయా దేవాలయాల్లో నిర్వహించిన కళ్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకుని వెళ్ళారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయాల్లో తీర్థప్రసాదాలు స్వీకరించారు. పురోహితులు, ఆలయ కమిటీ చైర్మన్లు, పాలకవర్గసభ్యులు, భక్తులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్‌లోని శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఆయన కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు నిరంజన్ శర్మ ఆలయ కమిటీ చైర్మన్ జగ్గయ్య శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్, గోలి సంతోష్,అమర నాగేంధర్, ఉప్పల రమేష్, గార్ల పాటి వెంకటేశ్వర్లు, దోమకొండ యాదగిరి, సురేందర్, అర్సం శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు..

గజ్వేల్ మండలం బిలాల్పూర్ గ్రామంలో సీతారాముల కళ్యాణంతో పాటు గజ్వేల్ పట్టణంలో పలు దేవాలయంలో మెదక్ పార్లమెంటు స్థానం అభ్యర్థి వెంకటరామిరెడ్డి దంపతులతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి పాల్గొన్నారు. అనంతరం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఇంటికి మెదక్ పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి దంపతులు రావడంతో ఘనంగా సన్మానించారు. అనంతరం షిరిడి సాయి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదా శ్రీనివాస్ తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని అయా గ్రామాల్లో శ్రీరామ నవమి పండుగ వేడుకలను ప్రజలు బుధవారం వైభవంగా నిర్వహించుకున్నారు. మండలంలోని చీలాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల అవరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో హజరై దర్శించుకున్నారు.అనంతరం అయా గ్రామాల ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువా కప్పి సన్మానించారు. అంతకుముందు మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి పూజలు చేశారు. నాయకులు రత్నాకర్ రెడ్డి,దామోదర్, అక్కరవేణీ పోచయ్య,పులి క్రిష్ణ, శానగొండ శ్రవణ్, శరత్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రొడ్డ మల్లేశం, జెల్లా ప్రభాకర్, అయా గ్రామాల నాయకులు రామకృష్ణ రెడ్డి, కొమ్ము రవి తదితరులు పాల్గొన్నారు.

ముస్లీం సోదరుల విజ్ఞప్తి...

లక్ష్మీపూర్ గ్రామంలోని లింగేశ్వర స్థిర అలయాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మండలంలోని ముస్లీం సోదరులు ఎమ్మెల్యేను కలిసి మండల కేంద్రంలో ఈద్గా,ఖబరిస్తాన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రమందజేశారు.

ఒడిబియ్యం ఘట్టంలో తన్నీరు శరత్ రావు..

వడ్లూర్ గ్రామంలో శ్రీ రామ నవమి సందర్భంగా నిర్వహించిన చిరుతల రామాయణం ముగింపు కార్యక్రమానికి పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావు హజరయ్యారు.గ్రామస్తులు సమర్పించిన ఒడిబియ్యం ఘట్టంలో పాల్గొన్నారు.

దాచారం,తోటపల్లిలో..

దాచారం,తోటపల్లి గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. దాచారంలో ఎంపీటీసీ కొలిపాక రాజు అధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.జెడ్పీటీసీ కనగండ్ల కవిత,అయా గ్రామాల మాజీ సర్పంచుల దంపతులు,గ్రామస్తులు హజరై ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.

నవ తెలంగాణ - కొండపాక

శ్రీరామనవమి వేడుకలు మండల వ్యాప్తంగా బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొండపాక పురాతన రామాలయంలో సీతారామ కళ్యాణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భద్రాచలంలో జరిగే విధంగా కొండపాక రామాలయంలో సీతారామ కళ్యాణం కమనీయంగా అర్చకులు వేదమంత్రోత్సవాల మధ్య నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, కాంగ్రెస్ పార్టీ పిసిసి సీనియర్ నాయకుడు అనంతుల శ్యాంమోహన్, మాజీ సర్పంచ్ చిట్టి మాధురి, రామకృష్ణారెడ్డి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈనెల 25 వరకు ప్రతిరోజు కళ్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. కుకునూరుపల్లి రామాలయంలో సీతారామ కళ్యాణం సాయంత్రం వైభవంగా కన్నుల పండుగ నిర్వహించారు. మండలంలోని మర్పడగ ఆంజనేయ స్వామి దేవాలయంలో మర్పడగ క్షేత్ర నిర్వాహకులు హరినాథ శర్మ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణం జరిగింది. దుద్దెడ వెంకటేశ్వర ఆలయం, సిరసనగాండ్ల వేణుగోపాల స్వామి ఆలయం, ఆరేపల్లి విశ్వనాథపల్లి, రవీంద్ర నగర్ బందారం తదితర గ్రామాల్లోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో సీతారామ చంద్ర స్వామి కళ్యాణం భక్తుల మధ్య వైభవంగా జరిగాయి. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

నవతెలంగాణ-తొగుట

శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం మండలంలోని అన్ని గ్రామాలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్నిగ్రామాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. తుక్కాపూర్ గ్రామంలోని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆలయకమిటీ సభ్యులు అంగరంగ ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు చెరుకు విజయమ్మ, ఎంపీపీ గాంధారి లత నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్ చెరుకు విజయ్ రెడ్డి, పాగాల కొండల్ రెడ్డి, తొగుట ప్రెస్ క్లబ్ అధ్య క్షుడు ఉల్లెంగల సాయి కుమార్, చెరుకు నరేష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, లింగాల కృష్ణ, కాంగ్రె స్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బి. స్వామి, ఉప్పల య్య, బొంబాయి వెంకటేష్ తదితరుల పాల్గొన్నారు.

నవ తెలంగాణ - హుస్నాబాద్ రూరల్

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ శివ భక్త మార్కండేయ సైత , శ్రీ సీతారామచంద్ర ఆలయంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న పట్టువస్త్రాలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సీతారాముల దీవెనలు మనందరిపై ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి , కొంకటి నళిని దేవి, బోజు రమాదేవి, కోమటి స్వర్ణలత, పెరుక భాగ్య రెడ్డి, పున్న లావణ్య సది, చిత్తారి పద్మ మ్యాదర బోయిన వేణు,మ్యాదర బోయిన శ్రీనివాస్, గోవింద రవి, దొడ్డి శ్రీనివాస్, గూళ్ళ రాజు, బొల్లి కల్పన తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

శ్రీరామనవమి సందర్భంగా మద్దూరు,దూల్మిట్ట, మండలంలోని అన్ని గ్రామాలలో సీతారాముల కళ్యాణాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల వేదమంత్రాలతో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు పార్నంది ఆంజనేయ శర్మ, రామ్మూర్తి శర్మ, నవీన్ శర్మ, రాజేష్ శర్మ పానుగంటి తిరుపతయ్య ఆగ చారి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట నాసరపుర కాలనీలోని శ్రీ హనుమాన్ దేవస్థానం లో శ్రీ సీతారామ కళ్యాణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణంలో కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, దేవస్థాన కమిటీ వారికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. దేవుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ వారు, కె.వి.ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ ఫౌండేషన్ సభ్యులు వెంకట్, సురేందర్, రాందాస్, బాలమల్లు, తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ -దౌల్తాబాద్

మండలం వ్యాప్తంగా బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణుల మంత్రోచ్చరణలు, బాజా భజంత్రీలతో రామచంద్రస్వామి కళ్యాణం జరిగింది. మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో స్థానిక ఎస్సై శ్రీరామ్ అనుష ప్రేమ్ దీప్ తోపాటు ఆయా గ్రామాల భక్తులు స్వచ్ఛందంగా స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. అన్ని గ్రామాల మాదిరిగానే ఇంద్రప్రియుల రామాలయ ధర్మకర్త అన్నారెడ్డి సుబాష్‌రెడ్డి దంపతులు స్వామివారి తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. కళ్యాణోత్సవంలో భాగంగా ఉదయం స్వామివారికి అభిషేకం, ఎదుర్కోళ్ళు నిర్వహించారు. సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో బాగంగా శుక్రవారం పొన్నంగి సేవ, శనివారం హనుమత్‌సేవ, ఆదివారం గరుడ సేవ జరుగుతుంది. సోమవారం తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం జరుగుతుంది. మంగళవారం శేషహోమం, పూర్ణాహుతి, శ్రీ పుష్పయాగం, ఉద్వాసనబలులు, సప్తవర్ణ ఏకాంత సేవ, తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. తదితర గ్రామాలలో శ్రీరామచంద్రస్వామి కళ్యాణం నిర్వహించారు. దౌల్తాబాద్‌లో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నవ తెలంగాణ -దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో బుధవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.11వ వార్డ్ కౌన్సిలర్ నందాల శ్రీజ శ్రీకాంత్,డాక్టర్ అరుణ్ దంపతులు సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కళ్యాణ మహోత్సవంలో మెప్మా ఆర్పీలు సునిత,శ్యామల,లక్ష్మీ నరసవ్వ,పెద్ది లక్ష్మి,పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

శ్రీరామ కల్యాణోత్సవంలో వైస్ ఎంపీపీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవా రం మండలంలోని కాన్గల్ గ్రామంలో శ్రీరామ కళ్యాణం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ నవమి పండుగను ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. శ్రీ రాముని దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. శ్రీరామ కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో రామ భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ-నార్సింగి

మండల వ్యాప్తంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నార్సింగి పట్టణ కేంద్రంలోని శ్రీ వేణుగోపాస్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీరామనవమిని పురస్కరించుకొని బుధవారం ఆలయ ప్రాంగణంలో శ్రీ రామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని ఆలయంలో వేద మంత్రోచ్చరణల మధ్య కన్నులపండువగా రాములవారి కల్యాణం ఘనంగా జరిపారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో అభిజిత్ శుభలగ్నం ముహూర్తంలో భాజాభజంత్రీలు, వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకులతో పాటు పాల్గొన్నారు. అనంతరం భక్తులు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేగుంట

పట్టణ కేంద్రంలో పంచముఖ హనుమాన్ ఆలయంలో శ్రీరామనవమి, శ్రీరాముని కళ్యాణ మహోత్సవం వేద పండితులు రాధాకృష్ణ శర్మ, వారి కుమారులచే అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం హోమం నిర్వహించారు. అయిత పరంజ్యోతి సంధ్యారాణి , అరుణ్ భావన, గ్రామస్తులు సీతారాముల కల్యాణానికి పుస్తె,మట్టెలు తలంబ్రాలకు పూజలు నిర్వహించి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయానికి మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లారు. అనంతరం కళ్యాణానికి విచ్చేసిన భక్తులకు అయిత పరంజ్యోతి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కాంటారెడ్డి తిరుపతి రెడ్డినీ వాసవి క్లబ్ జోన్ చైర్మన్ శాలువాతో సన్మానించారు. తాజా మాజీ సర్పంచ్ యం శ్రీనివాస్, ఎంపీటీసీ అయిత వెంకట్ లక్ష్మి, నాయకులు నాగరాజు, రాఘవ, నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, రవి, తేజ కిరణ్, రవీందర్, గాలి శ్రీనివాస్, గోవింద్, స్వాతి నాగరాజు, సురేష్, నాయకులు కొండల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మధు, శ్రీనివాస్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

ఉమ్మడి వెల్దుర్తి మాసాయిపేట్ మండలాల్లో వివిధ గ్రామాల్లో బుధవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు శ్రీరాముని జన్మ వృత్తాంతాన్ని సీతారాముల కళ్యాణం కథను వినిపించారు. మాసాయిపేట మండలం విఠలేశ్వర ఆలయంలో, బొమ్మారం సీతారామశ్రమంలో, మండల కేంద్రంలోని విఠలేశ్వరాలయం, బస్వాపూర్‌లో స్వయంభుగా వెలిసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో, ఉప్పులింగాపూర్ సీతారామాంజనేయ ఆలయంలో సీతారామ కళ్యాణోత్సవం వేద పండితుల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు పట్టు వస్త్రాలు ఒడిబియాలు సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



































